క్లుప్తంగా

'మనూ' దరఖాస్తుల గడువు ఈనెల 30 వరకు పొడిగింపు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో రెగ్యులర్, మెరిట్ ఆధారిత కోర్సుల దరఖాస్తు గడువు పెంచారు. మెరిట్ ఆధారిత రెగ్యులర్ కోర్సుల కోసం దరఖాస్తు ఫారమ్‌ను ఆన్‌లైన్‌లో సమర్పించడానికి చివరి తేదీని ఈనెల 30వ తేదీ వరకు పొడిగించారు. ఫారమ్ సవరణకు జూలై 31, ఆగస్టు 1వ తేదీ వరకు అవకాశం కల్పించారు. అంతకుముందు చివరి తేదీ జూలై 24 వరకు అవకాశం ఉండేది. మరిన్ని వివరాలకు ఇతర ఫోన్ నంబర్లు 98668 02414, 62077 28673 ను సంప్రదించవచ్చు.

ఐదు లక్షల మంది దివ్యాంగులకు ప్రయోజనం

- ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



గచ్చిబౌలి: దివ్యాంగుల పెన్షన్‌ను పెంచుతూ సీఎం కేసీఆర్ జారీ చేసిన ఉత్తర్వులతో రాష్ట్రంలో ఐదు లక్షల మంది లబ్ధిదారులకు ప్రయోజనం కల్గుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. దివ్యాంగుల పెన్షన్‌ను రూ.3016 నుంచి రూ. 4016 పెంచిన కేసీఆర్ దివ్యాంగులకు నిజమైన బంధావుడని ఆయన పేర్కొన్నారు. మంచిర్యాల సభా వేదికగా ఇచ్చిన హామీని నెరవేర్చారని ఆయన గుర్తు చేశారు. సంక్షేమ పథకాలలో తెలంగాణ రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు.

ముగిసిన స్టైల్‌తత్వ ఎగ్జిబిషన్



స్టైల్‌తత్వ ఎగ్జిబిషన్‌ను సందర్శించిన మేయర్ విజయలక్ష్మి తదితరులు

మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఏర్పాటు చేసిన స్టైల్‌తత్వ ఎగ్జిబిషన్ ఆదివారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె తన బంధువులు, ఎఫ్ఎల్ఓ హైదరాబాద్ చైర్‌పర్సన్ రీతూషాలతో కలిసి ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. 240 మంది ఎగ్జిబిటర్లు ఏర్పాటు చేసిన ఉత్పత్తులను సందర్శించి వారిని కొనియాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, టెక్ ఈక్విటీ వివిధ రంగాల్లోని మహిళలకు సహాయం అందిస్తోందన్నారు. 8 గిన్నిస్ వరల్డ్ రికార్డులను కైవసం చేసుకున్న హైదరాబాద్‌కు చెందిన శివనారాయణ్ జ్యువెలర్స్ గిన్నిస్ గుర్తింపు పొందిన పెండెంట్‌లు, ఇతర ఆభరణాలను ప్రదర్శించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు చేనేత కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులను ఆదుకుంటాం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: కలుషిత జలాలతో నష్టపోయిన గండిగూడెం మత్స్యకారులకు ప్రభుత్వపరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి హామీ ఇచ్చారు. కురిసిన భారీ వర్షాలకు అమీన్‌పూర్ మండలం గండిగూడెం గ్రామ చెరువులో పరిశ్రమలు విడిచిపెట్టిన వ్యర్థాలు చెరువులో కలియడంతో చేపలు చనిపోయాయి. దీంతో తమను ఆదుకోవాలంటూ చెరువుకు సంబంధించిన మత్స్యకారులు ఆదివారం ఎమ్మెల్యేను కలిసి విజ్ఞప్తి చేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి మాట్లాడారు. గతంలో కలుషిత జలాల కారణంగా నష్టపోయిన మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకుందన్నారు. అంతేకాకుండా కలుషిత జలాలు వదిలిన పరిశ్రమల యాజమాన్యాలతో చర్చించి రూ.కోటికి పైగా నష్టపరిహారం అందించడం జరిగిందని గుర్తు చేశారు. భవిష్యత్‌లో కలుషిత జలాలు చెరువులో కలవకుండా, పరిశ్రమల్లో కలుషిత జలాల శుద్ధీకరణ ప్లాంట్‌లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భాస్కర్ గౌడ్, మత్స్య సహకార సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

246 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

పటాన్‌చెరు టౌన్: అక్రమంగా తరలిస్తున్న 246 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ముత్తంగి టోల్ గేట్ వద్ద పోలీసులు, పౌరసరఫరా అధికారుల ఆదివారం పట్టుకున్నారు. వారి కథనం ప్రకారం... హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుంచి సేకరించిన రేషన్ బియ్యాన్ని మహారాష్ట్ర- నాందేడ్ జిల్లాకు అక్రమంగా తరలిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు పటాన్‌చెరు మండలంలోని ముత్తంగి టోల్ గేట్ వద్ద అధికారులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో లారీలో తరలిస్తున్న 525 బ్యాగులు బియ్యం సంచులు, సుమారు 246 క్వింటాళ్ల రేషన్ రైస్‌ను అధికారులు గుర్తించారు. ఆ మేరకు లారీని సీజ్ చేసి, రేషన్ బియ్యాన్ని పటాన్‌చెరు పౌరసరఫరా గోదాంకు తరలించారు. డీటీ విష్ణువర్ధన్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ పవన్, కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న లారీ యజమాని సలీం, లారీ డ్రైవర్ మహబూబ్ లాలా ఇద్దరూ హైదరాబాద్ చుట్టుపరిసర ప్రాంతాల నుంచి బియ్యాన్ని సేకరించి విక్రయిస్తున్నట్లు విచారణలో తెలిసింది.

చెరువులపై నీటిపారుదల శాఖ ప్రత్యేక నజర్

- ఎడతెరిపి లేని వానలతో చెరువులకు జలకళ
- రోజువారీగా నీటి నిల్వపై నివేదిక తయారీ
- వర్షం పడితే రెండు ఫీట్ల నీరు కిందకు వదిలివేత
- పరిసరాల్లో వరద సమస్యలు రాకుండా చర్యలు



అలుగు పారుతున్న మదీనాగూడలోని ఈర్లచెరువు

రాయదుర్గం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో నీటిపారుదల శాఖ చెరువులపై ప్రత్యేక దృష్టి సారించింది. వర్షాలతో గచ్చిబౌలి డివిజన్‌లోని చెరువులన్నింటికీ జలకళ సంతరించుకుంది. రాయదుర్గంలోని మల్కంచెరువు, నానక్‌రాంగూడలోని మేడికుంట, భగీరథ చెరువు, ఖాజాగూడలోని పెద్ద చెరువు, కేశవనగర్‌లో గోసాయికుంట, గోపన్‌పల్లితండా, గోపన్‌పల్లి, ఎన్టీఆర్‌కాలనీ, ఐఎస్‌బీ, నిథమ్, హెచ్‌సీయూ, ఐటీకారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో చెరువులు ఉన్నాయి. వర్షాల నేపథ్యంలో నీటిపారుదల శాఖ అధికారులు ప్రతి రోజూ ఈ చెరువులను పరిశీలిస్తున్నారు. నీటి నిల్వలను లెక్కించి ఉన్నతాధికారులకు రోజువారీగా నివేదిక పంపిస్తున్నారు. వారి ఆదేశాల మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.

నీటి పారుదల శాఖ చేపట్టిన చర్యలివే..

- ప్రస్తుతం చెరువుల్లోకి భారీగా నీరు వచ్చి చేరుతుండటంతో ప్రతి రోజూ ఉదయం ఆయా చెరువుల్లోని నీటి నిల్వలను స్థానిక అధికారులు పరిశీలిస్తున్నారు.
- రోజువారీ నీటినిల్వపై నివేదిక రూపొందించి ఉన్నతాధికారులకు పంపుతున్నారు.
- వర్షం వచ్చే అవకాశం ఉంటే చెరువులోని రెండు ఫీట్ల నీటిని కిందకు వదులుతున్నారు.
- వర్షాలు కురుస్తూనే ఉండే ఎప్పటికప్పుడు రెండు ఫీట్ల వరకు నీటిని ఖాళీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు.
- ప్రతి చెరువు కట్ట, తూముల పనితీరు, పటిష్టతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.
- ఎప్పటికప్పుడు ఎఫ్‌టీఎల్ నీటి మట్టం పూర్తిగా చేరక ముందే ముందస్తు చర్యలు చేపడుతున్నారు.
- అలుగు కింద ప్రాంతంలో ఉన్న కాలనీలు, బస్తీల్లోకి నీరు పారకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

ప్రజలు కోరుతున్నవి ఇవే....

- ప్రతి చెరువులో నీటి మట్టం పూర్తి స్థాయిలో ఉండకుండా చూడాలి
- వర్షాలు పడుతుంటే చెరువులోని నీరు కాలనీలు, బస్తీల్లోకి చేరకుండా చూడాలి
- తూముల ద్వారా ఎప్పటికప్పుడు నీటిని కిందకు వదిలేలా చూడాలి
- చెరువుకట్ట, తూములను మరింత పటిష్ట పర్చాలి
- చెరువు కట్టలు తెగకుండా తగిన చర్యలు తీసుకోవాలి
- ఒకవేళ పరిస్థితి చేయిదాటిపోయే పరిస్థితి ఉంటే తక్షణం స్పందించేలా అధికారులు ఏర్పాట్లు చేయాలి
- చెరువులోకి మురుగునీరు వచ్చి చేరకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలి



గోపన్నపల్లిలోని పెద్ద చెరువు వద్ద..



లింగంపల్లిలోని చాకలి చెరువు వద్ద...

సమస్యలు రాకుండా చూస్తున్నాం



చెరువులపై ప్రత్యేక దృష్టి పెట్టాం. రోజువారీగా పరిశీలన చేసి, వాటిలోని నీటినిల్వను లెక్కించి ఉన్నతాధికారులకు పంపిస్తున్నాం. వర్షాలు పడే పరిస్థితి ఉంటే ఎప్పటికప్పుడు స్పందించి నీటి నిల్వను రెండు ఫీట్లు కిందకు వదులుతున్నాం, వదిలిన సమయంలో కింది ప్రాంతంలో ఉండే కాలనీలు, బస్తీల్లో నీరు పారకుండా, సమస్యలు రాకుండా చూస్తున్నాం. ప్రస్తుతానికి అన్ని చెరువుల కట్టలు, తూములు పటిష్టంగానే ఉన్నాయి. ఎక్కడా ఎలాంటి సమస్యలు లేవు, ఇప్పటికే నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, ముఖ్యంగా దుర్గంచెరువును జీహెచ్‌ఎంసీ కమిషనర్ పరిశీలించి పలు సూచనలు చేశారు.

–నాగరాజు, ఏఈ నీటిపారుదల శాఖ

మదీనాగూడలో ఘనంగా బోనాలు



పోచమ్మ తల్లి బోనాల్లో పాల్గొన్న రవికుమార్ యాదవ్, గ్రామస్తులు

హఫీజ్‌పేట: హఫీజ్‌పేట్ డివిజన్ మదీనాగూడలోని పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలకు ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్ యాదవ్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గ ప్రజలు, సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నామన్నారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో గ్రామస్తులు వినోద్‌రావు, కిష్టయ్య, యాదగిరి ముదిరాజ్, అశోక్ గౌడ్, సత్యనారాయణ, శంకరయ్య, రమేష్, ఎల్లేష్, రాజేష్ గౌడ్, గణేష్, ఆకుల లక్ష్మణ్, శ్రీనివాస్, రాము, విజయ్ పాల్గొన్నారు.

సీఆర్ ఫౌండేషన్‌కు సీలింగ్ ఫ్యాన్ల విరాళం



ఫ్యాన్లు అందజేస్తున్న తూములూరి కృష్ణ ప్రసాద్, కుటుంబ సభ్యులు

హఫీజ్‌పేట : కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్‌లోని వృద్ధాశ్రమానికి 20 సీలింగ్ ఫ్యాన్లు ప్రఖ్యాత టెక్నాలజీ సంస్థ ఐల్యాబ్స్ డైరెక్టర్ తూములూరి కృష్ణ ప్రసాద్ ఆదివారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన సీఆర్ ఫౌండేషన్ చేస్తున్న సామాజిక సేవ కార్యక్రమాలను ప్రశంసించారు. కార్యక్రమంలో కృష్ణప్రసాద్ కుటుంబసభ్యులు సర్వాని, శివాని, హరిణి, సీఆర్ ఫౌండేషన్ ట్రెజరర్ చెన్నకేశవరావు, వృద్ధాశ్రమం సలహా కమిటీ సభ్యురాలు డాక్టర్ పి.సరస్వతి, యెర్నేని సత్యనారాయణ పాల్గొన్నారు.

నిరు పేదలకు అండగా ఉండేది సీఎం కేసీఆర్

ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: నిరు పేదలకు అండగా ఉండేది సీఎం కేసీఆర్ అని ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. జీఓ నం.58, 59 కింద దరఖాస్తు చేసుకున్న పేదలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిశీలించి న్యాయం చేయాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యేలు గాంధీ, వివేకానంద, సుధీర్‌రెడ్డిలు సీఎం కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ, జీఓ నం.59 కింద దరఖాస్తు చేసుకున్న కొందరికి అధిక ధరలు వస్తున్నాయని, వివాదాలలో ఉన్న స్థలాల్లో నివసిస్తున్న పేద, మధ్య తరగతి కుటుంబాలకు యాజమాన్య హక్కు కల్పించాలని సీఎంకు విన్నవించారు. సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారని ఎమ్మెల్యే గాంధీ అన్నారు.



ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసిన ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యేలు గాంధీ, వివేకానంద, సుధీర్ రెడ్డి

హెచ్‌సీయూలో కొనసాగుతున్న విద్యార్థుల నిరసన



హెచ్‌సీయూలోని పరిపాలనా భవనం ముందు నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘం నాయకులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థుల డిమాండ్లు పరిష్కరించేంత వరకు నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయని హెచ్‌సీయూ స్టూడెంట్స్ యూనియన్ 2022–23 ప్రతినిధులు స్పష్టం చేశారు. ఆదివారం కూడా హెచ్‌సీయూలోని పరిపాలనా భవనం ముందు నిరసన కొనసాగించారు. హెచ్‌సీయూలో అండర్ గ్రాడ్యుయేట్ , పోస్టుగాడ్యుయేట్ దరఖాస్తుల ఫీజు రద్దు చేయాలని, పీహెచ్‌డీ ఇంటర్వ్యూ కోసం విభాగాల్లో కుల ధ్రువీకరణ పత్రాల తప్పనిసరి సమర్పణను రద్దు చేయాలని, రిజిస్ట్రార్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని, సీఈని నియమించాలని, క్యాంపస్‌లోకి మతతత్వ శక్తులను అరికట్టడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్ల సాధన కోసం స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో హెచ్‌సీయూలోని పరిపాలనా భవనం ముందు రాత్రి, పగలు తేడాల లేకుండా నిరసన కొనసాగిస్తున్నారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

వాకింగ్‌కు వెళ్లిన వృద్ధుడి అదృశ్యం

హఫీజ్‌పేట: వృద్ధుడు అదృశ్యమైన ఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. చందానగర్ రాయల్ టవర్స్‌లోని ఫ్లాట్ నం.404లో నివాసముండే హన్మోజీ దొండి రావు (78) ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటలకు భోజనం చేసి వాకింగ్ చేయడానికి పీజేఆర్ స్టేడియానికి వెళ్లాడు. సాయంత్రమైనా అతను ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించడంతో పాటు బంధువులను వాకబు చేసినా దొండి రావు ఆచూకీ తెలియరాలేదు. దీంతో పోలీసులను ఆశ్రయించగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు దొండి రావు నీలం రంగు లుంగీ, తెల్లటి బనియన్ వేసుకున్నాడని, తెలుగు, హిందీ, మరాఠీ భాషలు మాట్లాడగలడని కుటుంబ సభ్యులు తెలిపారు.



హన్మోజీ దొండి రావు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



శిల్పారామంలో ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మాదాపూర్: కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం ఎస్వీజీ కళావర్షిణీ డాన్స్ ఇనిస్టిట్యూట్ గురువు సంధ్యారాణి శిష్యబృందం కర్ణాటక గాత్ర కచేరీ, భరతనాట్యం, కూచిపూడి ప్రదర్శన ఇచ్చింది. గాత్ర కచేరీలో గజాననయుతం, ముద్దుగారే యశోద, కొండలలో నెలకొన్న, మాధవ కేశవ, భరతనాట్య నృత్యరీతిలో మూసికవాహన, పుష్పాంజలి, దశావతారం తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. కూచిపూడి రీతిలో వినాయక కౌతం, తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. కళాకారులు సంధ్యరాణి, కౌటిల్య, సాత్విక్, నిత్య, ప్రద్యుమ్న, హంసిని, త్రివేణి, మాన్విత, నిరిజ్ఞ, అనికా, వైనవి లక్ష్మి, ప్రిశ,అభిజ్ఞ, ప్రణవి, మణిపూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఫలహార బండి ఊరేగింపు

రాయదుర్గం: కొండాపూర్ డివిజన్ అంజయ్యనగర్‌లో ఆదివారం బోనాల సందర్భంగా ఫలహార బండి ఊరేగింపు వైభవంగా సాగింది. అంజయ్యనగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. అసోసియేషన్ ప్రతినిధులు ఆయనతో పాటు పలువురు అతిథులను ఘనంగా సత్కరించారు. భక్తులు, బీఆర్ఎస్ నాయకులు రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా తదితరులు

డాక్టర్ సమరం సేవలు అమోఘం



అపర్ణ గ్రాండేలో డాక్టర్ సమరం దంపతులను సన్మానిస్తున్న సీనియర్ సిటిజన్స్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్లలోని అపర్ణ గ్రాండే సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రపతి బంగారు పతక గ్రహీత డాక్టర్ సమరం దంపతులను ఆదివారం ఘనంగా సన్మానించారు. రెడ్‌క్రాస్ ద్వారా చేసిన సేవలకు గాను డాక్టర్ సమరం రాష్ట్రపతి బంగారు పతకాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్లు మాట్లాడుతూ, వైద్యుడిగా డాక్టర్ సమరం ప్రజలకు అందిస్తున్న సేవలు అమోఘమని కొనియాడారు. కార్యక్రమంలో అపర్ణ గ్రాండే సీనియర్ సిటిజన్లు త్రినాథరావు, సుబ్రహ్మణ్య శాస్త్రి, సుధాకర్‌రెడ్డి, మన్మోహన్, సందీప్ నారంగ్, కేవీస్ మూర్తి, నాగరాజారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

గచ్చిబౌలి: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా సోమవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తెలిపారు. కొండాపూర్ ఏరియా జిల్లా ఆస్పత్రిలో ఉదయం 9.30 గంటలకు రక్తదాన శిబిరం ప్రారంభమవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, బీఆర్ఎస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యం

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపాలిటీలోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తెలిపారు. మున్సిపల్ పరిధిలోని టైలర్స్ కాలనీలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆయన కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్టీసీ కాలనీలో రూ.40లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, కౌన్సిలర్లు మహదేవరెడ్డి, యూసుఫ్, సీనియర్ నాయకులు చంద్రశేఖర్, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు వెయ్యి మంది ఐటీ ఉద్యోగుల రక్తదానం

రాయదుర్గం: రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కె.తారకరామారావు జన్మదినం సందర్భంగా సోమవారం ఒకే రోజు 1000 మంది ఐటీ ఉద్యోగులు రక్తదానం చేసేలా ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తెలంగాణ ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ కౌన్సిల్(టీఎఫ్ఎంసీ) ఆధ్వర్యంలో రాయదుర్గం మధురానగర్‌లోని దివ్యశ్రీ ఎన్ఎస్ఎల్ ఐటీ పార్కులో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. శనివారం టీఎఫ్ఎంసీ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ మాట్లాడుతూ, ఐటీ టవర్‌లో 10 వేల మంది పని చేస్తున్నారని, అందులో కనీసం 1000 మంది ఐటీ ఉద్యోగులు రక్తదానం చేస్తారని భావిస్తున్నామన్నారు. సోమవారం ఉదయం 11 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు 'గిఫ్ట్ ఏ స్మైల్' పేరిట రెడ్‌క్రాస్ సొసైటీ సహాయం ఈ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

ఉపాధి కోసం వచ్చి బలవన్మరణం

- ఆర్టీసీ బస్సు కిందపడి ఆత్మహత్య చేసుకున్న వలస కూలీ

గచ్చిబౌలి: ఆర్టీసీ బస్సు కిందపడి వలస కూలీ ఆత్మహత్య చేసుకున్న ఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ జేమ్స్ బాబు తెలిపిన ప్రకారం.. వెస్ట్ బెంగాల్‌లోని మోర్గాన్ కు చెందిన బిషు రజాక్(41) కూలీ పనుల కోసం ఆదివారం కొండాపూర్‌కు తోటి కూలీల వద్దకు వచ్చాడు. కొండాపూర్‌లోని యూఐసీ లేబర్ క్యాంపు నుంచి సరుకులు కొనేందుకు కూలీలు కొండాపూర్ ఎక్స్ రోడ్డుకు వచ్చారు. వారితో పాటు వచ్చిన బిషు రజాక్ 8వ బెటాలియన్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు (ఏపీ28జడ్3579) వెనుక చక్రాల కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. తోటి కూలీలు అతడిని బయటకు లాగి కొండాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాయంత్రం 7 గంటలకు మృతి చెందాడు. కాగా, బిషు రజాక్ మృతిపై గాంధీ ఆసుపత్రి నుంచి ఫోన్ రావడంతో గచ్చిబౌలి పోలీసులు వెళ్లి తోటి కూలీలను ఆరా తీశారు. బస్సు తగలడంతోనే అతను పడిపోయాడని చెప్పడంతో సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించారు. బిషు పరుగున వెళ్లి ఆర్టీసీ బస్సు వెనుక టైర్ కింద పడినట్లు స్పష్టంగా కనిపించడంతో సూసైడ్ కేసుగా నమోదు చేశారు. సొంత ఊరు నుంచి వచ్చిన రోజే ఆత్మహత్యకు పాల్పడటానికి గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.